నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | గురువారం 13 జూన్ 2024 | WARANGAL HANUMAKONDA

**తొలిరోజు ఉత్సాహంగా విద్యార్థుల బడిబాట**

- పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల పంపిణీ
- చాలాచోట్ల అధ్వానంగా కనిపించిన పరిసరాలు
- మురుగునీరు, చెత్తాచెదారంతో తప్పని ఇబ్బందులు
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు, వంట గదులు
- నత్తనడకన పెండింగ్ నిర్మాణ పనులు



గాంధీనగర్‌లోని గ్రెయిన్ మార్కెట్ పాఠశాలలో బురదను దాటుకుంటూ వెళ్తున్న విద్యార్థులు


ఏటూరునాగారం : బాలుర ఆశ్రమ పాఠశాలలో స్నానపు గదులను పరిశీలిస్తున్న దామోదర్‌స్వామి


ఏటూరునాగారంలోని గిరిజన బాలుర పాఠశాలలో సరుకులు లేక ఖాళీగా ఉన్న స్టోర్ రూం



# సమస్యలిలా చదువు సాగేదెలా?

## అసౌకర్యాల నడుమ మోగిన బడి గంట

**సెలవుల్లో సరదాగా గడిపిన విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో బుధవారం బడిబాట పట్టగా తొలిరోజు చాలాచోట్ల సమస్యలు స్వాగతం పలికాయి. అపరిశుభ్ర వాతావరణం, అసంపూర్తి పనులు, అసౌకర్యాల నడుమ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. మొదటి రోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారం పంపిణీ చేయగా ఎక్కడా చూసినా సందడి నెలకొంది. 'మన ఊరు-మన బడి'ని అటకెక్కించి తీసుకొచ్చిన 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పనులు అధికారుల చిత్తశుద్ధి లేక నత్తనడకన సాగుతూ పాఠశాలలు తెరుచుకునే నాటికీ పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. పెచ్చులూడుతున్న పైకప్పులు, చెత్తాచెదారంతో కంపు కొడుతున్న మరుగుదొడ్లు, ప్రమాదకరంగా ఉన్న సంప్‌హౌస్‌లు, కాంట్రాక్టర్లు నిర్మాణం కోసం తెచ్చిన రాళ్లు, ఇసుక కుప్పలు, పారుతున్న మురుగునీరు, విద్యార్థుల ముందే ట్రాక్టర్‌తో చదును చేస్తున్న దృశ్యాలు కనిపించాయి.**

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 12**


మహబూబాబాద్‌లోని కంకరబోర్డు పాఠశాలకు వస్తున్న విద్యార్థులు →


వాజేడు : మొరుమురుకాలనీ ఎంపీపీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులు


వాజేడు ఎంపీపీ పాఠశాలలో తలుపులు అమర్చకుండా ఉన్న మరుగుదొడ్డి

బడిగంట మోగడంతో బుధవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. మొదటిరోజు విద్యార్థులు సంబురంగా రాగా, పలు చోట్ల పూలతో ఉపాధ్యాయులు ఆహ్వానించగా చాలా బడుల్లో సమస్యలే పలకరించాయి. అలాగే స్వాగత ద్వారాలకు మామిడితోరణాలు, పూలు కట్టి ఆకర్షణీయంగా అలంకరించారు. నెలన్నర తర్వాత పాఠశాలకు వచ్చిన విద్యార్థులు తమ స్నేహితులతో కలిసి ఆవరణలో కలియదిరిగి సందడి చేశారు. అనంతరం తరగతి గదులకు చేరుకోగా, ప్రార్థన ముగిసిన తర్వాత విద్యార్థులకు ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల చేతులమీదుగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు అందుకొని మురిసిపోయారు. అయితే అన్ని జిల్లాలకు విద్యార్థులకనుగుణంగా ఇవి సరఫరా కాలేదని తెలుస్తోంది. అలాగే హనుమకొండలోని మర్కజీ స్కూల్‌లో సంపు హౌస్‌కు నీళ్లు రాక విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడ్డారు. అలాగే వరంగల్ గాంధీనగర్‌లో గ్రెయిన్‌మార్కెట్ స్కూల్ ఆవరణ బురదనీటితో అధ్వానంగా ఉండగా పిల్లలు అందులోంచి జంప్ చేయాల్సి వచ్చింది. అలాగే కాశీబుగ్గలోని నరేంద్రనగర్ ఉన్నత పాఠశాల, క్రిస్టియన్ హైస్కూల్, సుందరయ్యనగర్‌లోని పాఠశాలలు అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు, నిరుపయోగంగా ఉన్న వాటర్ టాప్స్, ప్రమాదకరంగా మారిన నీటి సంపులు, చెత్తాచెదారం, అధ్వాన పారిశుధ్యంతో కనిపించాయి. అలాగే వాజేడు, ఏటూరునాగారం మండలాల్లోని చాలా పాఠశాలల్లో కంపుకొడుతున్న మరుగుదొడ్లు, తలుపులు లేని బాలికల వాష్‌రూములు అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపట్టాయి. అలాగే పాఠశాలల ప్రహరీ, వంటగదులు, భోజన శాలలు, మరుగుదొడ్లు చెత్తాచెదారంతో నిండి ఉండడం విద్యార్థులకు అసౌకర్యం కలిగించాయి. ఇలా బడి గంట మోగిన మొదటిరోజే విద్యార్థులకు పరీక్ష పెట్టాయి. ఇలా అయితే చదువులు ఎలా సాగుతాయని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.


హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ స్కూల్‌లో పాఠాలు బోధిస్తున్న టీచర్


మహబూబాబాద్ మండలం మాదాపురం పాఠశాలలో విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

# బడులు తెరిచాక హడావిడి తనిఖీలు..

- ఆశ్రమ పాఠశాలల్లో తిష్టవేసిన సమస్యలు
- ముందుగా పట్టించుకోని గిరిజన సంక్షేమశాఖ
- సరఫరా కాని నిత్యావసర సరుకులు
- విదార్థులకు భోజనం పెట్టేదెట్లా?

ఏటూరునాగారం, జూన్ 12 : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో అధికారులు తనిఖీలతో హడావిడి చేస్తున్నారు. ముందస్తుగా సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అధికారులు పాఠశాలలు తెరిచిన రోజునే తనిఖీలు చేయడం విమర్శలకు దారి తీస్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 64 ఆశ్రమ పాఠశాలలు, 30 హాస్టల్స్, 29 పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్, రెండు జూనియర్ కాలేజీలుండగా, ఇందులో హనుమకొండ జిల్లాలో 12, జనగామలో10, జయశంకర్ భూపాలపల్లిలో 13, మహబూబాబాద్‌లో 34, ములుగులో 44, వరంగల్ జిల్లాలో 12 ఉన్నాయి. వీటిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వెంటనే పనులు చేపట్టాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్లు, డీటీడీవోలు, ఏటీడీవోలు, ఏసీఎంవోలు, ఐటీడీఏ అధికారులు, ఇంజినీరింగ్ శాఖ డీఈఈ, ఏఈఈ, జీసీసీ డీఎం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ ఐటీడీఏ పీవో నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో బుధవారం సుమారు 30 మంది అధికారులు తనిఖీలు చేపట్టారు.

**పాఠశాలల నిండా సమస్యలే..**

ఉమ్మడి జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలు, హాస్టల్స్‌లో వాటర్ లీకేజీ, తాగునీటి ఇబ్బందులు, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, సెప్టిక్ ట్యాంకులు క్లీన్ చేయడం, కిచెన్ షెడ్లు, ట్యూబ్‌లైట్లు, సోలార్ ల్యాంప్‌లు, ఫ్యాన్లు, బెడ్లు, ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు, స్నానపు గదులకు నీటి సరఫరా, మురుగు నీటికాల్వలు, సోలార్ వాటర్ హీటర్స్ పనితీరు, బోర్లు తదితర సమస్యలు నెలకొన్నాయి. విద్యార్థులు బడి బాట పట్టే సమయంలో అధికారులు సమస్యలను గుర్తించి తక్షణం పరిష్కరించాలన్న ఆదేశాలతో ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు అయోమయానికి గురవుతున్నారు. దీనికి తోడు అనేక పాఠశాలలు, హాస్టల్స్‌లో నిత్యావసర సరుకులు నిండు కున్నాయి. కూరగాయలు, అరటి పండ్లు, మటన్, చికెన్, కోడిగుడ్ల సరఫరాకు ముందుగానే టెండర్లు నిర్వహిస్తారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో నిత్యావసర సరుకులు లేవని తనిఖీకి వచ్చిన ప్రత్యేకాధికారి, ఐటీడీఏ ఏవో దామోదర్‌స్వామికి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ తెలిపారు. ఇంత వరకు పాఠశాలకు జీసీసీ ద్వారా సరఫరా కాలేదనడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు.


మట్టెవాడ పాఠశాలలో మట్టిని చదును చేస్తున్న డోజర్



వరంగల్ దేశాయిపేట ప్రాథమిక పాఠశాలలో ఇంకా కొనసాగుతున్న పనులు


పుస్తకాలు, యూనిఫారమ్స్‌తో మర్కజీ పాఠశాల విద్యార్థినులు


ఏటూరునాగారంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో అధ్వాన్నంగా ఉన్న నల్లాలు, పేరుకుపోయిన నాచు


కృష్ణకాలనీ హైస్కూల్‌లో ఎండలో కింద కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు


ప్రాక్టీసింగ్ స్కూల్‌లో అడ్మిషన్లు ఇస్తున్న ఉపాధ్యాయురాలు


క్రిస్టియన్‌కాలనీ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు

## గిరిజన పాఠశాలల్లో మరమ్మతులు లేవ్..

- అపరిశుభ్రంగా టాయిలెట్స్
- ప్రమాద కరంగా కిటికీలు
- పనిచేయని తాగునీటి బోర్లు

ఏటూరునాగారం, జూన్ 12 : ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు నెలకొన్నాయి. కొన్ని ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో ఆర్‌వో ప్లాంట్లు సరిగా పని చేయడం లేదు. టాయిలెట్స్‌కు నీటి సరఫరా జరగడం లేదు. కొన్ని చోట్ల తరగతి గదులకు కిటికీ తలుపులు ఊడిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. పలు చోట్ల వంటగదుల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. ఐటీడీఏ కేంద్రంగా ఉన్న ఏటూరునాగారంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో అనేక సమస్యలు నెలకొన్నాయి. చిన్నబోయినపల్లి ఆశ్ర మ పాఠశాలలో 400 మంది విద్యార్థులకు 12 టాయిలెట్స్ ఉండగా, నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి. నీటి కోసం నాలుగు బోర్లు ఉండగా రెండు వేసవిలో చెడిపోయాయి. కన్నాయిగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోని పై అంతస్తులోని తరగతి గదుల కిటికీలు ఊడిపోయాయి. కిచెన్ షెడ్ అసంపూర్తిగా ఉంది. పూర్తి స్థాయిలో గోడ నిర్మాణం చేపట్టలేదు. రెండు బ్లాకుల్లో ఆరు చొప్పున టాయిలెట్స్ ఉండగా ఇందులో కొన్నింటికి తలుపులు లేవు. సీసీ కెమెరాలు సరిగా పనిచేయడం లేదు. తాగునీటి బోరు మోటర్ రిపేరులో ఉంది. తరగతి గదులు అధ్వానంగా ఉన్నాయి.

# ముంపు నివారణకు శాశ్వత ప్రణాళిక

- నగరాభివృద్ధికి నిధులు తీసుకువస్తాం
- లక్ష వృక్షార్చన లక్ష్యంతో మొక్కలు నాటాలి
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- పలు అంశాలపై అధికారులతో సమీక్ష


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్, జూన్ 12 : నగరం భవిష్యత్‌లో ముంపునకు గురికాకుండా శాశ్వత ప్రాతిపదికన దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండలోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో మేయర్ గుండు సుధారాణి, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తాపట్నాయక్, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, సంధ్యారాణితో కలిసి మంత్రి వరద ముంపు నివారణ, గ్రేటర్‌లోని 66 డివిజన్ల అభివృద్ధి, మొక్కల పెంపకంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో నగరం ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గతంలో వరద ముంపు సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వరద నీరు నిలువకుండా నాలాల్లోకి పంపేలా ముందస్తుగా పనులు చేయాలన్నారు. నగరంలోకి బయటి నుంచి వచ్చే వరద నీటిని దారి మళ్లించేలా ఉన్నతాధికారులతో చర్చించి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. నగరాభివృద్ధికి ఎన్ని నిధులైనా తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. గ్రేటర్‌లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలన్నారు. గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు ఇచ్చే సూచనలను పరిగణలోకి తీసుకొని సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

**పవర్ పాయింట్ ప్రజంటేషన్**

నగరం వరద ముంపునకు గురికాకుండా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలనే విషయంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు మంత్రి సురేఖకు వివరించారు. 2022–23 సంవత్సరంలో వరద ముంపును ఎదుర్కోవడానికి తీసుకున్న చర్యలను వివరించారు. నగరంలో ఇప్పటికీ నాలాల పూడికతీత, నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. వడ్డేపల్లి నాలా నుంచి సమ్మయ్యనగర్, నయీంనగర్ మంగలివాగు, యూటీ (ఎస్సారెస్పీ) కెనాల్ ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. భద్రకాళీ నాలా, భట్టుపల్లి, సాకరాశికుంట నుంచి, 12 మోరీలు ద్వారా భద్రకాళీ చెరువు, జీడబ్ల్యూఎంసీ నుంచి మ్యూజికల్ గార్డెన్, కాకతీయ కాలనీ మీదుగా నాగారం చెరువు వరకు వరద నీరు వెళ్తుందని వివరించారు. ఇరిగేషన్ ద్వారా రూ.158 కోట్ల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మరికొన్ని ప్రతిపాదనల అవసరం ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పోతనరోడ్ నుంచి అలంకార్ మీదుగా ఎస్సారెస్పీ వరకు వరద కాలువ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రూ. 200 కోట్ల నిధులు అవసరమవుతాయని అధికారులు మంత్రికి వివరించారు. వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వడ్డేపల్లి చెరువు నుంచి ఊరచెరువు వరకు రూ. 60 కోట్ల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గ్రేటర్ పరిధిలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని జంక్షన్లను విస్తరించాలన్నారు. లక్ష వృక్షార్చన కార్యక్రమం చేపట్టి విరివిగా మొక్కలు నాటాలన్నారు. గ్రేటర్‌లో 217 కిలోమీటర్ల మేర స్ట్రెచ్ గుర్తించి మొక్కలు నాటేందుకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని విలీన గ్రామాలు గరీబ్‌నగర్, కీర్తినగర్‌లో తాగునీటి పైన్‌లైన్ల కోసం తవ్వి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ విలీన గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల కొరత ఉందన్నారు. వీధిలైట్ల సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. మిషన్ భగీరథ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అటవీ శాఖ అధికారి కృష్ణ, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ అశోక్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, వైద్య, ఆరోగ్య శాఖ, విపత్తుల నివారణ, రోడ్లు, భవనాల శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**నమస్తే తెలంగాణ**

**విలేకరులు కావలెను**

**అర్హతలు :**

- పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం.
- మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన.
- తెలుగు భాషపై పట్టు ఉండి.. చక్కగా రాయగలగాలి.
- ఇంటర్ ఉత్తీర్ణులై.. 30 ఏళ్లలోపు ఉండాలి.
- రిపోర్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారురాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలకు హాజరుకావాలి.
- బయోడాటాతో రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోగలరు.
- తెలుగు టైపింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యం.

హనుమకొండ జిల్లాలో కావాల్సిన కేంద్రాలు : 1. నడికూడ

వరంగల్ జిల్లా : 1. దుగ్గొండి 2. మట్టెవాడ 3. వరంగల్ చౌరస్తా

మహబూబాబాద్ జిల్లా : 1. సీరోలు 2. మహబూబాబాద్ టౌన్

జనగామ జిల్లా : 1. జనగామ టౌన్ 2. స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్

భూపాలపల్లి జిల్లా : 1. మహాముత్తారం 2. మొగుళ్లపల్లి

రాతపరీక్ష తేదీ : 13-06-2024 (గురువారం)
సమయం : ఉదయం 11 గంటలకు..
పరీక్షా స్థలం : నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, ఐటీ పార్క్ లేన్, మడికొండ, హనుమకొండ.
ఫోన్ నంబర్ : 9182777976